ఇరుకైన వంతెనతో తప్పని ఇక్కట్లు

పోడూరు: జగన్నాథపురం గ్రామంలో నరసాపురం ప్రధాన కాలువపై ఉన్న ఇరుకైన కాలిబాట వంతెనతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. దాదాపు 30 ఏళ్ల కిందట ఈ వంతెనను నిర్మించారు. వంతెన ఇరుకుగా ఉండడంతో పాటు గత కొంతకాలం క్రితం శిధిలావస్థకు చేరుకుంది. దాదాపు ఆరేళ్ల కిందట వంతెన రెయిలింగ్ దెబ్బతినడంతో పాటు శ్లాబ్‌పై రంధ్రాలు ఏర్పడడంతో మరమ్మతులు నిర్వహించారు. అయితే వంతెన ఇరుకుగా ఉండడంతో లారీలు, కార్లు, ట్రాక్టర్లు వంటి వాహనాలు ఇటుగా వెళ్లవు. దీంతో ఇసుక, కంకర, సిమ్మెంట్ వంటి భవన నిర్మాణ సామగ్రి తరలించేందుకు కాలువకు అటువైపు ఉండే గ్రామస్తులు అవస్థలు పడాల్సి వస్తోంది. కవిటం మీదుగా దాదాపు 3 కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించి భవన నిర్మాణ సామగ్రిని తరలించాల్సి వస్తోందని కాలువకు అటువైపు ఉండే గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

కొత్తవంతెన నిర్మించాలి..

ప్రధాన కాలువపై ఇరుకైన వంతెన కారణంగా రవాణా సదుపాయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదారేళ్లలో నరసాపురం ప్రధాన కాలువపై సగంచెరువు, వేడంగి గ్రామాల్లో ఇరుకైన వంతెనలున్న చోట భారీ వంతెనలు నిర్మించి రవాణా వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఇదే తరహాలో జగన్నాథపురం వద్ద కూడా విశాలమైన వంతెనను నిర్మించి కవిటం–వెలగలేరు రహదారిని కలపడం ద్వారా రవాణా సదుపాయం మరింత మెరుగుపడుతుందని గ్రామస్తులు కోరుతున్నారు.



జగన్నాథపురంలో ఇరుకైన కాలిబాట వంతెన

> **రవాణా సదుపాయం మెరుగుపర్చాలి**
>
> 
>
> జగన్నాథపురం గ్రామంలో నరసాపురం ప్రధాన కాలువపై ఇరుకైన వంతెన మాత్రమే ఉండడం వల్ల చాలాఏళ్లుగా స్థానిక ప్రజలు సరైన రవాణా సదుపాయం లేక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ విశాలమైన వంతెన నిర్మించేలా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలి.
>
> – పిల్లి ప్రసాద్, సీపీఎం జిల్లా నాయకుడు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడి గృహ నిర్బంధం



ఆనందకుమార్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

నరసాపురం రూరల్: తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానపర్చిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు కాకిలేటి ఆనందకుమార్ (మధు) డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేడ్కర్ సెంటర్లో మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి పోలీసుల అనుమతి లేకపోవడంతో మధుతో పాటు మరికొంత మందిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన వారిని అరెస్టు చేసే వరకూ వివిధ రూపాల్లో ఉద్యమిస్తామన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

పోడూరు: వైద్య, ఆరోగ్యసిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాభాయి ఆదేశించారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు పీహెచ్‌సీని శనివారం ఆమె సందర్శించారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్యసేవలను, రికార్డులను, అందుబాటులో ఉన్న మందుల వివరాలను ఆమె పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలని సూచించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. గుర్తించిన వ్యాధిగ్రస్తులకు తగిన సలహాలు, సూచనలివ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సిబ్బందిని ఆదేశించారు.

పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

వీరవాసరం: మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పురోభివృద్ధికి ప్రతినిత్యం కృషి చేయడం జరుగుతుందని ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని తెలిపారు. వీరవాసరం పీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. ప్రజలందరికీ ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సక్రమ వైద్యాన్ని అందజేయాలన్నారు. బాలింతలు, గర్భిణులకు సరైన సమయంలో టీకాలు అందించి పౌష్టికాహారం అందేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఏవి రామాంజనేయులు, సర్పంచ్ చికిలే మంగతాయారు, పీహెచ్‌సీ వైద్యులు హసీనా ముంతాజ్, సీహెచ్ దేవదాసు , సుజాత, లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

27న పనికిరాని అగ్నిమాపక పరికరాల వేలం

ఆకివీడు: స్థానిక అగ్నిమాపక కేంద్రంలోని పనికిరాని అగ్నిమాపక పరికరాలను ఈ నెల 27న బహిరంగ వేలం వేయనున్నట్లు అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు తెలిపారు ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాడైపోయిన వివిధ పరికరాలు, రెస్క్యూ జనరల్ ఎక్విప్‌మెంట్, వాహనం విడిభాగాలు, బ్యాటరీలు తదితర వాటిని వేలం వేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు అగ్నిమాపక కేంద్రంలో సంప్రదించాలని వివరించారు.

బెల్ట్‌షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు



లోసరిలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న దృశ్యం

భీమవరం అర్బన్: బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు హెచ్చరించారు. భీమవరం మండలంలోని లోసరి గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కుక్కల ఇందిరను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ బలరామరాజు మాట్లాడుతూ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారి సమాచారాన్ని 9440902439 నెంబర్‌కు అందజేయాలని కోరారు. ఈ దాడిలో ఎస్సైలు పీవీవీఎన్ ఉమామహేశ్వరరావు, పి.సునిల్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి పాదాలను తాకిన సూర్య కిరణాలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని జెపీ రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పాదాలకు సూర్య కిరణాలు తాకాయి. ఫాల్గుణ మాసం పురస్కరించుకొని స్వామివారికి విశేష అలంకరణ చేశామని ఆలయ ఈవో సత్యనారాయణ రాజు తెలిపారు. ఉదయం శ్రీవారి పాదాలను సూర్యకిరణాలు తాకడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అక్రమ తవ్వకాలు ఆపాలని తహసీల్దార్‌కు వినతి

పెనుగొండ: సిద్ధాంతం వశిష్ట గోదావరి మధ్యలంకలో అక్రమ మట్టి తవ్వకాలు జరపకుండా నిలువరించాలని సీపీఎం జిల్లా నాయకులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పెనుగొండ తహసీల్దారు జి.అనిత కుమారికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. మట్టి తవ్వకాలు జరపడానికి మధ్యస్థలంకలోకి పొక్లెయినలను తీసుకువచ్చారని వివరించారు. పెరుగు లంక భూములను పేదలకు పంచాలని సీపీఎం గతంలో డిమాండ్ చేసిందన్నారు. దీనికి విరుద్ధంగా అక్రమార్కులు ధనార్జనకు లంకభూములు తవ్వకానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తవ్వకాల వల్ల రైతులు తీవ్రఇబ్బందులు పడతారన్నారు. వాహనాలను సత్వరం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్ధాంతం గ్రామ కార్యదర్శి కప్పల రత్నరాజు మండల కార్యదర్శి షేక్ పాదుషా, ఎస్ వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలి

పెనుగొండ: రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బిల్లు తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర మాల పంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు, రాష్ట్ర కన్వీనరు గుమ్మాపు సూర్యవరప్రసాద్‌లు తెలిపారు. ఆచంట పెదపేటలో శనివారం గ్రామ సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు నివాసంలో ఆచంట నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. రాజీవ్‌రంజాన్ మిశ్రా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక తప్పుల తడక అని దుయ్యబట్టారు. వర్గీకరణ ప్రయత్నాన్ని కూటమి ఆపకపోతే మాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు సీఎం అయిన ప్రతిసారీ మాల మాదిగల మధ్య వర్గీకరణ చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 24న భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, కచేరీ సెంటర్‌కు చేరుకుని బైఠాయించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జిల్లెల సుదమా, కటికతల రాజారావు, బీరా మధు, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, బండి సుందర రామమూర్తి, యాదాల రవిచంద్ర, ఉన్నమట్ల మునిబాబు, ఈది ప్రవీణ్, ప్రసన్నకుమార్, మట్టారాము, చవ్వాకుల భరత్, పోతుమూడి రామచంద్రరావు, బుడితి భీమారావవు, పిల్లినాగన్న, జెంట్రీ శ్రీను, రాజశేఖర్, చిక్కాల రాజు తదితరులు పాల్గొన్నారు.



కచేరి సెంటర్‌లో ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

నరసాపురం: రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సహాయకేంద్రం ద్వారా అందే సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ సూచించారు. శనివారం జడ్జి నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి సబ్‌జైలులోనూ ఉచిత న్యాయ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోలేని వారు ఈ సహాయ కేంద్రాల ద్వారా ఉచిత సహాయం పొందవచ్చని చెప్పారు. జైలులో సదుపాయాలు పూర్తిస్థాయిలో అందించాలని చెప్పారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ, సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి, జూనియర్ సివిల్‌జడ్జి కె.శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి సునీల్‌కుమార్

ఏఐ, ఎంఎల్ కోర్సులదే భవిష్యత్

నరసాపురం: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), మెషీన్ లెర్నింగ్(ఎంఎల్) కోర్సులు సమీప భవిష్యత్‌లో మార్కెట్‌ను ఏలబోతున్నాయని ఇండియన్ ఇమ్యూనోజికల్స్ ప్రైయివేట్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్(హైదరాబాద్) ప్రసాద శ్రీరామ కవచం సూచించారు. శనివారం వైఎన్ కళాశాలలో కామర్స్ అండ్ మనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్ యుగంలో కెరీర్ నిర్మాణం అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాపులో శ్రీరామకవచం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో ఏఐ, ఎంల్ రంగాలపై ఆధారపడి వాణిజ్య నిర్వహణ సాగబోతుందని చెప్పారు. కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందుకు తగిన కోర్సులను ఎంచుకోవాలని సూచించారు. ఏఐ, ఎంఎల్ రంగాల్లో నైపుణ్యాలను పెంచుకోవాలని చెప్పారు. రిస్క్ మేనేజ్‌మెంట్, ఫైనాన్సియల్ జర్నలిజం, ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్ అంశాల్లో కూడా దృష్టి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం రామకృష్ణ, పీజీ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఎన్.చింతారావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రీరామకవచం

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

పోడూరు: అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని యూనియన్ జిల్లా నాయకురాలు బి.కళ్యాణి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ గతేడాదిలో 42 రోజుల పాటు నిర్వహించిన సమ్మె సందర్భంగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా హామీలను ఇంతవరకు నెరవేర్చలేదని కళ్యాణి ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలను రూ.26 వేలకు పెంచాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకోసం అంగన్‌వాడీ ఉద్యోగులు మరో పోరాటానికి సిద్ధం కావాలని కళ్యాణి పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు ప్రస్తుత రాజకీయ రిపోర్టు ఇచ్చారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వై.రాణి, సీహెచ్.శ్రీదేవి, నాగలక్ష్మి, జాన్సీ, రజని, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కక్షపూరిత దాడులు

పోడూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ శ్రేణులపై కక్ష్యపూరిత దాడులకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె పార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందనీ, రెడ్‌బుక్ పాలన సాగిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కక్ష్యపూరితంగా దాడులు చేయిస్తోందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జోగాడ ఉమా మహేశ్వరరావు, జోగి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి కృష్ణాజీ, రామానుజుల చిన మధు, మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కర్రా జయసరిత, వైఎస్సార్‌సీపీ నాయకులు

కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు

భీమవరం: భీమవరంలో పంట కాలువ కాలుష్యాన్ని నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ బి లక్ష్మీనారాయణ చెప్పారు. శనివారం ఫోక్సో కోర్టులో మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటకాలువలో కాలుష్య నివారణకు నెల రోజుల్లో తీసుకున్న చర్యలను జడ్జి అడిగి తెలుసుకున్నారు. చెత్తను పంట కాలువలో వేస్తున్న వారిని గుర్తించి నిబంధనలకు అనుగుణంగా చిన్నమొత్తంలో జరిమానాలు వేయడం, ఆవిధంగా వచ్చిన సొమ్ముతో కాలుష్య నివారణకు అవగాహన కల్పించడానికి వినియోగిస్తే వాడితే ప్రయోజనం ఉంటుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఇతరశాఖల అధికారులను సమన్వయం చేసుకుని ప్రణాళికలను రూపొందించాలన్నారు. అవసరమైతే మండల న్యాయ సేవా సంస్థ తరపున ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు అవగాహన కార్యక్రమాల్లో పాలు పంచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి బి అమ్మశ్రీ, మునిసిపల్ అసిస్టెంట్ కమీషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి శ్రీనివాసరాజు, ఇరిగేషన్ డీఈ పీఎస్‌వీవీఎస్ మూర్తి, ఏఈ ఏవీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కాలుష్య నివారణకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

చిరువ్యాపారుల పొట్టగొడుతున్న ఆక్రమణల తొలగింపు

భీమవరం: రహదార్ల వెంబడి ట్రాఫిక్ అంతరాయం పేరుతో ఆక్రమణలు తొలగిస్తున్నందున చిరువ్యాపారులు ఉపాధిని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అటువంటి వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో తోపుడు బండ్లపై చిరు వ్యాపారం చేసుకొనే వ్యాపారులను, రోడ్డు పక్కన ఉంటున్న షాపులను అధికారులు వారికి ప్రత్యామ్నాయం చూపకుండా తొలగిస్తూ నిరాశ్రయులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతనే తొలగింపు చర్యలు చేపట్టాలని గోపాలన్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

కాళ్ల: గ్రామాల్లో కూలీలకు వేగుచుక్కగా ఉన్న ఉపాధిహామీ చట్టానికి తగినన్ని నిధులు కేటాయించి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ కాళ్ల మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని పెదఅమిరం గ్రామంలో శనివారం చెరువు పని చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తున్న కూలీలపై ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారి కూలీల మనసు గాయపడేలా మాట్లాడటం సరికాదన్నారు. కష్టపడి పని చేసిన వారానికే వేతనం చెల్లించాలని చట్టం చెబుతున్నా కింది స్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా బడ్జెట్లో నిధులు పెంచి పని దినాలు వేతనం పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.సత్యవతి, ఎం.అవ్వమ్మ, కె.అరుణ, బి.మార్తమ్మ, ఐ.చినగంగయ్య, బి.పెద్దిరాజు, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

వీరవాసరం: వరి చేలో కోత కోసే ముందర పదును ఉన్నప్పుడు నవధాన్యాలు చల్లడం వల్ల భూమి సారవంతం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి సమావేశం వీరవాసరంలో మండల సమైక్య కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో విత్తనాలకు కావలసిన నిధులు సేకరణ, వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2025–26 పై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. నవధాన్యాలు వేయడం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని చెప్పారు. ఒక్కొక్క మొక్క వేర్లు ఒక రకం బ్యాక్టీరియా అభివృద్ధి చెందుతుందని మొక్కల పెరుగుదలకు ఈ సూక్ష్మజీవులు ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం ఏడిఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఎక్స్ కె సిబ్బంది ప్రతి గ్రామంలో రైతులందరి చేత నవధాన్యాలు వేయించాలని చెప్పారు. ఏవో బిన్సీ బాబు మాట్లాడుతూ ప్రతి రైతు నవధాన్యాలు వెయ్యాలని తెలిపారు. ఏపీఎం జ్యోతి రాణి మాట్లాడుతూ.. నవధాన్యాలు తేవడానికి సిబ్బంది యొక్క సంఘాల నుంచి లోన్ ఇవ్వడానికి సహకరిస్తామని చెప్పారు. పకతి వ్యవసాయ అనుభవాలను సమావేశంలో చర్చించారు. డివిజన్ చార్జెస్ స్వామి, మండల ఇంచార్జ్ దేవి నాగరాజు, యూనిట్ ఇంచార్జ్ వినోద్ కుమార్, సిసి పద్మావతి, బీశెట్టి శ్రీనివాస్, బీశెట్టి మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరుణకుమారి

అక్రమ ఆక్వా చెరువులను రద్దు చేయాలి

భీమవరం అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్న ఆక్వా చెరువులను వెంటనే రద్దు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. క్రాంతిబాబు డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని పెదగరువు గ్రామ పంచాయతీ చినపేటలో ఇళ్ల మధ్య అక్రమంగా తవ్వుతున్న ఆక్వా చెరువును శనివారం కేవీపీఎస్ బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ జిల్లాలో అధికారుల వైఫల్యం వలనే అక్రమ అక్వా చెరువులు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామంలో దళితుల ఇళ్లకు చేర్చి అక్రమ చెరువులు తవ్వుతున్నారన్నారు. స్థానికులు మొరపెట్టుకుంటే అప్పుడు వీఆర్‌వో వచ్చి నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్య, రెవెన్యూ, వ్యవసాయ, మైనింగ్ తదితర శాఖలు పర్యవేక్షణ లోపం వల్లనే రాత్రిరాత్రే ఆక్వా చెరువులు పుట్టుకొస్తున్నాయన్నారు. చెరువును నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు తవ్వుతున్నారని అడిగినందుకు వారిపేనే కేసు పెట్టారన్నారు. అక్రమ ఆక్వా చెరువు తవ్వకాన్ని రద్దు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాని హెచ్చరించారు. ఈ సీఐటీయూ నాయకులు ఇంజేటి శ్రీనివాస్, స్థానికులు పాలపర్తి జ్ఞానరాజు తదితరులు ఉన్నారు.



పెదగరువులోని చినపేటలో అక్రమ చెరువు తవ్వకాన్ని పరిశీలిస్తున్న కేవీపీఎస్ బృంద సభ్యులు

రేపు రోజువారీ పన్నుల వసూలుకు వేలం

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీ మార్కెట్‌లో రోజువారీ పన్నుల వసూళ్లపై సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హక్కులు కల్పించేందుకు ఉదయం 11 గంటలకు బహిరంగవేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రూ.3 లక్షలు ధరావత్తు చెల్లించి రూ 5 లక్షలు సాల్వెన్సీ చూపించి పాటలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

పెనుగొండ: తూర్పుగోదావరి జిల్లా దూబచర్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండుగులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటిపుష్పరాజ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చెప్పుల దండ వేయడం రాజకీయ కోణంలో చూడాలా? లేకపోతే ఇతర కారణాల అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు నిజాలు బయటపెట్టాలన్నారు. మరోసారి విగ్రహాల జోలికి వెళ్లకుండా చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఇనుము అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి

పెనుగొండ: పంచాయతీ వద్ద తొలగించిన వాటర్ ట్యాంకు నుంచి వచ్చిన ఇనుమును అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. శనివారం ఇనుమును బయటకు తరలిస్తున్నట్లు ప్రజల నుంచి సమాచారం వచ్చిందని చెప్పారు. ఈ ఘటనపై పంచాయతీ అధికారులు స్పష్టత ఇచ్చారు. ప్రభుత్వ అనుమతి రాగానే ఇనుముకు వేలం వేస్తామని, శనివారం కేవలం ఇనుముని పంచాయతీ కార్యాలయ ఆవరణలోకి తరలించామని పేర్కొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

పోడూరు: పోక్సో చట్టంపై మైనర్‌బాలలు అవగాహన కలిగి ఉండాలని నరసాపురం అదనపు సివిల్‌జడ్జి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం యలమంచిలి మండలం చించినాడ గ్రామ పంచాయతీలో ×లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించే చట్టం%పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో అదనపు సివిల్ జడ్జి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పోక్సో చట్టం కింద నమోదైన చాలా కేసుల్లో దగ్గర రక్త సంబంధీకులే మైనర్ బాలలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. అంతరించిపోతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థే దీనికి కారణమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎవరితో ఏవిధంగా ప్రవర్తించాలో నేర్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజమణి, సీడీపీఓ ఇందిర, ప్యానెల్ న్యాయవాదులు పద్మజ, చాముండేశ్వరి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ సందర్శన

పోడూరు: పాలకొల్లు రైల్వే స్టేషన్‌ను శనివారం డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) మెంబర్ జక్కంపూడి కుమార్ సందర్శించారు. రైల్వేస్టేషన్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆయా పనులపై స్టేషన్ ఇన్‌చార్జి ఎ.స్నేహ, రైల్వేసిబ్బంది, కాంట్రాక్టర్లతో ఆయన మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కొల్లి కొండాప్రసాద్, బోడ కనకరాజు, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులున్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

కాళ్ల: పేకాట స్థావరంపై దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కాళ్ల ఎస్సై శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేంపాడు గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చే శామని వివరించారు. వారి వద్ద రూ.1,550 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.